క్లుప్తంగా

సాత్వికాదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో పురాతన ఆలయమైన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు ఆదివారం సాత్వికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్తిక నక్ష దీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భా గంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి పూజలు చేశారు. త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామార్చన తదితర కార్యక్రమాలు జరిపారు. మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆ లయ ప్రదక్షిణలు, పంచహారతులు, పల్లకీ సేవ కొనసాగించారు. అయ్యప్ప సన్నిధిలో మ ధ్యాహ్నం భోజన వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

దుర్గమ్మ చెంత భక్తి సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం విజయవాడకు చెందిన శృతిలయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో భక్తి సంగీతాన్ని ఆలపించారు. డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య నేతృత్వంలో పలు కీర్తనలు చక్కటి గాత్రంతో ఆలపించారు. కోదండ రామయ్యకు పాలపర్తి ఆంజనేయశాస్త్రి వయోలిన్‌పై, చిట్టిబాబు తబలాపై చక్కటి సహకారాన్ని అందించారు. అమ్మవారిని దర్శించుకుని మహా మండపం వద్దకు చేరుకున్న భక్తులు కళావేదికపై జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాన్ని ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఈ కెవీఎస్ఆర్ కోటేశ్వరరావు ప్రసంశా పత్రాలను, అమ్మవారి ప్రసాదాలను అందచేశారు.

వీఎంసీ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదులు-పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే.. ప్రజా ఫిర్యాదులు పరిష్కార కార్యక్రమాన్ని సోమవారం చిట్టి నగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్-1 కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తానని, సత్యనారాయణపురంలోని సర్కిల్-2లో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంతోపాటు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కూడా కార్యక్రమం జరుగుతుందని వివరించారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

సాయిబాబా మందిరంలో వ్రతాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్ప సిద్ధి షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం రుత్వికులు చిట్టేల పవన్ కుమార్ శర్మ, శ్రీనివాస శర్మ భక్తులతో సాయి సత్య వ్రతాలు చేయించారు. ఇందులో 88 మంది దంపతులు అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. హారతి అనంతరం మధ్యాహ్నం స్వామివారి తీర్ధ ప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాలను మందిరం అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పీవీఎల్ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పీ రజనీకాంత్, జీ వెంకట కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు పర్యవేక్షించారు. పలువురు సాయి సేవకులు భక్తులకు తమ సేవలను అందించారు.

అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం తేవాలంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తోన్న భర్తపై భవానిపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం ఎంఐజీకి చెందిన చిక్కాల సాయి శరణ్య, చిక్కాల రాజేష్‌లకు 2015లో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో సాయిశరణ్య తల్లిదండ్రులు కట్నంగా రూ. 3లక్షలు నగదు, బంగారు నగలు రాజేష్‌కు ఇచ్చారు. కొంత కాలం వీరి సంసారం సజావుగానే సాగింది. వీరికి బాబు పుట్టాడు. ఆ తర్వాత శరణ్య భర్త రాజేష్ వ్యసనాలకు బానిసయ్యాడు. అదనంగా రూ. 2 లక్షలు కట్నం తేవాలంటూ వేధించసాగాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను వేధిస్తున్నాడు. కన్న కొడుకును, భార్యను చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చి భయాందోళనకు గురిచేస్తున్నాడు. సెప్టెంబర్ నెలలో మద్యం సేవించి ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. రౌడీలను తీసుకువచ్చి నానారకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీనిపై చిక్కాల సాయి శరణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అడ్డగోలుగా మద్యం దుకాణాలు

- సంపద సృష్టే పరమావధిగా కూటమి అనుమతులు
- పశ్చిమంలో ఒక కిలోమీటరు పరిధిలో పది దుకాణాలు
- బార్, వైన్ షాపులు పక్కపక్కనే
- నిబంధనలు గాలికొదిలిన వైనం



సితారా సెంటర్ సమీపంలో ఒక దాని సమీపంలో మరొక మద్యం దుకాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీతో పశ్చిమ నియోజకవర్గంలో అడ్డగోలుగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత సంపద సృష్టే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలు ప్రజల ఆరోగ్యాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. కొత్త మద్యం పాలసీతో వీధికొక మద్యం దుకాణం అందుబాటులోకి రావటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించటం, మద్యాన్ని వీలైనంత తక్కువగా అమ్మకాలు చేసింది. కానీ నేటి కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు సాగించటంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

మద్యం దుకాణాలు లేదా బార్ అండ్ రెస్టారెంట్లు ఏర్పాటు చేయటంపై ప్రభుత్వానికి సంబంధించి కొన్ని నిబంధనలు ఉన్నాయి. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో వాటిని పూర్తిగా గాలికొదిలేశారని స్థానిక ప్రజానీకం వ్యాఖ్యానిస్తుంది. జాతీయ రహదారికి 500 మీటర్ల దూరంలో ఉండాలన్న నిబంధన గాల్లో కలిసిపోయింది. విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలోనే ఉండాలన్న నిబంధనకు అధికారులు పాతరేశారు. దేవాలయాలకు వంద మీటర్ల దూరంలో ఉండాలన్న నిబంధన గాలికి ఎగిరిపోయింది. ప్రధానంగా 20 వేల జనాభాకి ఒక వైన్ షాపు ఉండాలి అన్న నిబంధనను అధికారులు పూర్తిగా విస్మరించారు. సితారా సెంటర్ నుంచి నియోజకవర్గం సరిహద్దు వరకూ ఉన్న పలు మార్కెట్ల సమీపంలోనే ఈ దుకాణాలు కొత్తగా పుట్టుకొచ్చాయి.

కిరాణా షాపుల మాదిరిగా...

పశ్చిమంలో ఒక కిలో మీటరు పరిధిలో పది దుకాణాలు ఉన్నాయి. సితార సెంటర్ నుంచి గొల్లపూడి కమర్షియల్ కాంప్లెక్స్ పప్పుల బజార్ వరకు కిరాణా షాపులతో సమానంగా సుమారు 10 మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు పుట్టుకొచ్చాయి. అలాగే గద్దబొమ్మ సెంటర్ సమీపంలోనూ పక్కపక్కనే దుకాణాలు దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గంలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ రోడ్డుకు ఇరువైపులా ఎదురెదురుగా బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్స్ దుకాణాలు ఏర్పాటు చేశారు. బార్ అండ్ రెస్టారెంట్లు పాతవే అయినా కొత్తగా మద్యం దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలిసాయి. కేవలం ఒక కిలో మీటర్ పరిధిలో ఇన్ని దుకాణాలు ఏర్పాటు కావటంపై స్థానిక ప్రజానీకం విస్మయాన్ని వ్యక్తం చేస్తుంది. ఇంత విచ్చలవిడిగా దుకాణాలకు అనుమతులు ఇవ్వటం ఏమిటంటూ పలువురు నేతలు సైతం ప్రశ్నిస్తున్నారు. ఇంత దారుణంగా దుకాణాలు వెలుస్తున్నా అధికార కూటమి ప్రజాప్రతినిధులెవరూ వాటిని పట్టించుకోవటంలేదు. వారికి అందులో భాగస్వామ్యం ఉండబట్టే అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు పాటించాలి



మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో నిబంధనలు పాటించాలి. ఒకే రోడ్డులో పెద్ద సంఖ్యలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయటం దారుణం. ప్రజారోగ్యాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించి ఈ విధమైన మద్యం దుకాణాలకు అనుమతులివ్వటం సమాజంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. దుకాణాలు ఏర్పాటు చేసే క్రమంలో స్థానిక ప్రజల అభిప్రాయాన్ని తీసుకొని అనుమతి ఇవ్వాలి. – బోయి సత్యబాబు, సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి

అనుబంధాల బలోపేతానికి దోహదం

వైఎస్సార్ సీపీ నేత మల్లాది విష్ణు



భవానీ ఐలాండ్‌లో మాట్లాడుతున్న మల్లాది విష్ణు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్తిక వన సమారాధనలు మనలోని ఐక్యతకు నిదర్శనమని, అలాగే మానవ సంబంధాలు..అనుబంధాల బలోపేతానికి దోహదం చేస్తాయని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు తెలిపారు. బ్రాహ్మణ బిజినెస్ విజయవాడ ఆధ్వర్యాన ఆదివారం భవానీ ఐలాండ్‌లో నిర్వహించిన కార్తిక వనసమారాధన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ కార్తిక వనసమారాధనలో మన సంస్కృతి, సంప్రదాయాల మేరకు ఉసిరి చెట్టు దగ్గర చేసే పూజతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, బ్రాహ్మణ సామాజికవర్గీయులు పాల్గొన్నారు.

చాత్తాద శ్రీవైష్ణవుల ఆత్మీయ బంధు సమ్మేళనం



చాత్తాద శ్రీవైష్ణవుల బంధు ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నవ్యాంధ్రప్రదేశ్ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో భవానీపురంలోని సాయి అన్న గార్డెన్‌లో శ్రీవైష్ణవుల ఆత్మీయ బంధు సమ్మేళనం పేరుతో కార్తీక వనసమారాధన కార్యక్రమం జరిగింది. తొలుత పూజాధికాలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సంఘం కోశాధికారి సీవీ శ్రీనివాసులు మాట్లాడుతూ మన సంఘీయులంతా ఏక తాటిపై ఉంటూ ఒకరికొకరు సహాయ సహకారాలను అంది పుచ్చుకోవాలని ఆకాంక్షించారు. అప్పుడే సంఘం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ప్రధాన కార్యదర్శి మధురాంతకం శ్రీనివాసరావు, సలహాదారు నారాయణం రమేష్, చాత్తాద శ్రీవైష్ణవాణి పబ్లిషర్ యాదగిరి జనకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మోహనం.. కూచిపూడి నృత్యం





విజయవాడ కల్చరల్: జేఎంఎస్ యోగభారతి అకాడమీ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. నాట్యాచార్యులు జంగం మనీషా చక్రవర్తి, జంగం శిరీషా చక్రవర్తి ఆధ్వర్యంలో పూర్వరంగం, బ్రహ్మాంజలి, సందెకాడ పుట్టినట్టి, బృందావనం, గోవర్ధనగిరిధారి, జావళి, బృందావన నిలయేరాదే, కృష్ణ శబ్దం, అంజనీ సుతుడు,పంతుము లాడెదమా అంశాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథి విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యానికి పూర్వవైభవం తీసుకురావడానికి యువ నాట్యాచారిణిలు జంగం శిరీషా చక్రవర్తి, మనీషా చక్రవర్తి కృషిచేస్తున్నారని తెలిపారు. జేఎంఎస్ యోగ భారతి నిర్వాహకులు జంగం విజయకుమార్, చక్రవర్తి, కళాపోషకుడు గోళ్ల నారాయణరావు, ఎం శ్రీనివాసకుమార్, జీ రామ్మోనరావు పాల్గొన్నారు. చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ



రెండో అంతస్తులో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



మొదటి అంతస్తులో బఫే విధానంలో అన్న ప్రసాద వితరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో భక్తులకు నిత్యాన్నదానం జరుగుతుంది. కార్తీక మాసం, ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి రోజు ఉదయం 10–30 గంటల నుంచి మధ్యాహ్నం 3–30 గంటల వరకు, సాయంత్రం 7–30 గంటల నుంచి 8–30 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో నిత్యాన్నదానం చేస్తారు. శుక్ర, ఆదివారాల్లో రోజుకు 8 వేలు, సోమవారం నుంచి గురువారం 6 వేల మందికి అన్న ప్రసాద వితరణ ఉంటుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం రెండో అంతస్తులో భక్తులు కూర్చుని తినే విధానంలో, మొదటి అంతస్తులో బఫే పద్ధతిలో అన్న ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇక సాయంత్రం 7–30 గంటల నుంచి రాజగోపురం ఎదుట వెయ్యి మంది, శుక్రవారం, ఆదివారం 1500 మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. శుక్రవారం, శనివారం, ఆదివారాలలో రద్దీ అధికంగా ఉండటంతో అన్నప్రసాద వితరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులందరూ అన్నప్రసాదం స్వీకరించేందుకు, ఎక్కువ సమయం క్యూలైన్‌లో వేచి ఉండకుండా ఉండేందుకు బఫే పద్ధతిని ప్రవేశ పెట్టామని తెలిపారు. ఇక కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారాలతో పాటు విశేష పర్వదినాల్లో రోజుకు 2500 మందికి మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం సంధ్యా సమయంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరంలోని పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఫల పుష్ప ప్రదర్శనలో మొక్కల ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో బోన్సాయ్ మొక్కలతో పాటు ఇండోర్, అవుట్ డోర్‌లో పెంచుకునే మొక్కలు, గార్డెనింగ్ మెటీరియల్స్ లభ్యమవుతున్నాయి. ప్రకృతి సేద్యం, మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా స్టాల్స్ కూడా ఏర్పాటు చేశారు. నగరవాసులకు కావాల్సిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను తక్కువ ఖర్చుతో రసాయనాలు ఉపయోగించకుండా వంటగదిలో ఉత్పత్తయ్యే వ్యర్థాలతో పండించుకునే విధానాలపై స్టాల్స్‌లో అవగాహన కలిగ్పిస్తున్నట్టు సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ సంఘం విజయవాడ ప్రతినిధి పీవీడీ నాగేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వ హామీ నెరవేర్చాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): అధికారంలోకి వస్తే పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం ఇచ్చి, అందులో ఇల్లు నిర్మించి ఇస్తామన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆదివారం 43వ డివిజన్ పరిధిలోని ఊర్మిళానగర్ పార్క్ సెంటర్‌లో పేదల ఇళ్ల స్థలాల అర్జీలు రాసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట..అధికారంలోకి వచ్చాక ఒక మాట మాదిరిగా రెండు నాల్కల ధోరణిని విడిచిపెట్టి పేదలకు చేసిన సొంత ఇల్లు వాగ్దానం అమలు చేయాలని, అప్పటి వరకు సీపీఐ పోరాటం ఆగదని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, డివిజన్ సహాయ కార్యదర్శి యరసాని జోసఫ్, పోలాసి శ్రీనివాసరావు, దేవరాజు, సీహెచ్ అభిలాష్, పి.విజయ్, కె.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆర్యవైశ్య వన సమారాధన



ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో హాజరైన ఆర్యవైశ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విజయవాడ నగరంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు హాజరయ్యారు. శ్రీ వాసవీ ఫౌండేషన్, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఇతర ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వనసమారాధన కార్యక్రమానికి ఆర్భాటంగా వేలాది మందికి పాసులు జారీ చేశారు. సత్యనారాయణస్వామి వ్రతాలు, ఆపై భోజనాలకు ఆహ్వానాలు పంపారు. దీంతో పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు. అయితే వచ్చిన వారికి తగిన విధంగా ఏర్పాట్లు భోజన వసతి ఏర్పాట్లు లేకపోవటంపై వచ్చిన పెదవి విరిచారు. కార్యక్రమానికి ఏపీ ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ అండ్ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, వాసవీ ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు, ఛాంబర్ అధ్యక్షుడు గద్దం రవి, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నేత అనీల్ తదితరులు నాయకత్వం వహించారు.

దొడ్ల రామారావు చిరస్మరణీయుడు



దొడ్ల రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వరాష్ట్ర ఉదమ నేత దొడ్ల రామారావు మృతి రాష్ట్రానికి తీరని లోటని పలువురు నాయకులు తెలిపారు. విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ఎస్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం తపస్వి, దొడ్ల టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత దొడ్ల రామారావు సంస్మరణ సభ జరిగింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సోషలిస్ట్ నాయకుడిగా, స్వరాష్ట్రం కోసం ఉద్యమించిన నేతగా ప్రజలందరికీ చిరపరిచితుడైన దొడ్ల రామారావు చిరస్మరణీయుడని కొనియాడారు. మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ చిరకాల మిత్రుడు దొడ్ల రామారావు ఉద్యమ నేతగానే కాకుండా ఆధ్యాత్మిక వేత్తగా తన ట్రావెల్స్ ద్వారా భక్తుల కోసం తీర్థ యాత్రలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రామారావు సతీమణి రాజ్యలక్ష్మి, కుమారుడు హేమంత్ కుమార్, కోడలు వెంకట లక్ష్మి, కుమార్తెలు పద్మావతి, కనకమ్మ, లక్ష్మి, జగదీశ్వరి దంపతులు, మనుమడు హేమరాజ్, పలువురు రాజకీయ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళ అదృశ్యమైన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని విద్యాధరపురం కామకోటినగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. మాజేటీ లక్ష్మీశ్రీనివాస్, కీర్తి వర్ధిని దంపతులు. వీరికి ఒక కుమార్తె జాహ్నవి ఉంది. ఆమె అభిషేక్ అనే వ్యక్తిని ప్రేమించింది. తల్లిదండ్రులకు చెప్పకుండా నెల రోజుల క్రితం కులాంతర వివాహం చేసుకుంది. అప్పటి నుంచి జాహ్నవి తల్లి కీర్తి వర్ధిని దిగాలుగా ఉంటుంది. కుమార్తె ఇంటికి వస్తే తాను ఇంటి నుంచి వెళ్లిపోతానని భర్తకు చెప్పింది. ఈ నేపథ్యంలో జాహ్నవి తన తండ్రి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి రిసెప్షన్ పెట్టుకున్నాం అందరూ రావాలని ఆహ్వానించింది. ఈ విషయాన్ని లక్ష్మీ శ్రీనివాస్ తన భార్యకు చెప్పాడు. ఆమెకు నచ్చ చెప్పి రిసెప్షన్‌కు వెళ్దాం అనుకున్నాడు. ఆదివారం ఉదయం 11. 30 గంటల సమయంలో కీర్తి వర్ధిని తనకు రూ. 500 కావాలని, బయటకు వెళ్లి లైనింగ్ క్లాత్ తెచ్చుకోవాలని భర్తతో చెప్పింది. భర్త వద్ద రూ. 500 తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. భార్య ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి ఇరుగు పొరుగు వారిని అడిగాడు. ఆచూకీ తెలియకపోవడంతో తన భార్య కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. లక్ష్మీ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.





కార్తిక వనభోజనాల సందడి

కార్తిక వనభోజనాలతో నగరంలోని భవానీ ద్వీపం ఆదివారం సందడిగా మారింది. బోటులో ద్వీపానికి వస్తూ ప్రకృతి అందాలను వారి సెల్ కెమెరాల్లో బంధించారు. పిన్న, పెద్ద కుటుంబ సమేతంగా తరలిరావడంతో భవానీ ద్వీపం కోలాహలంగా కనిపించింది. పిల్లలు, పెద్దలు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. మధ్యాహ్నం వనభోజనాలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











సద్గురు సంగీత సభ సేవలు ఆదర్శం

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీతసభ సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి అన్నారు. శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే 31వ జాతీయ వార్షిక సంగీత మహోత్సవాలు దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలను ప్రారంభించిన కృష్ణవేణి మాట్లాడుతూ 31 ఏళ్లుగా నిరంతరం సంగీత సేవలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్, గాత్ర సంగీత విద్వాంసురాలు గాయత్రీ గౌరీనాథ్, ముందుంబై శారదా దీప్తి పాల్గొన్నారు. తొలిరోజు లతాంగి సోదరీమణులు అర్చన, సమన్వి పలు సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కల్యాణరామన్, ఘటంపై రామకృష్ణ సహకరించారు.